ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 13 ఏప్రిల్ 2024

ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

నియోజక వర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	కడియం కావ్య	సుధీర్‌కుమార్	ఆరూరి రమేష్
మహబూబాబాద్	బలరాం నాయక్	మాలోతు కవిత	సీతారాంనాయక్



ఇక సమరమే!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటం.. అటు వరంగల్.. ఇటు మహబూబాబాద్ పార్లమెంట్ స్థానా లకు ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించడంతో ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి. కడియం షాక్ నుంచి తేరుకున్న బీఆర్ఎస్.. ఉత్కంఠకు తెర దించుతూ వరంగల్ అభ్యర్థిని ఖరారు చేసింది. దీంతో అభ్యర్థులంతా ప్రజాక్షేత్రంలో 'ఇక సమరమే' అంటూ తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. కుల సమీకరణలతో పాటు గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లను లెక్కలు వేస్తు నేతలు వ్యూహాలకు పదను పెడుతున్నారు. గులాబీ పార్టీకి కంచుకోటలుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు బలమైన అభ్యర్థులను బరిలో దించగా, తమ స్థానాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.


అభ్యర్థులు ఫైనల్....

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం వరంగల్, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం మహబూబాబాద్ లోక్‌సభ సీట్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్ఎస్ తొలుత మార్చి 13న వరంగల్ అభ్యర్థిగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తెను ప్రకటించింది. కానీ తాను ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేయలేనంటూ మార్చి 27న బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కావ్య 30వ తేదీన తన తండ్రి కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ ఆమెను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎవరు అనే ఉత్కంఠ నెలకొంది. తెరపైకి పలువురి పేర్లు రావడం, అనేక నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం బీఆర్ఎస్ అధినేత హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా ఉన్న సుధీర్‌కుమార్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో రెండు వారాలుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. ఇక బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితలను ఖరారు చేశారు. ఇక బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్‌ను బరిలో ఉన్నారు. మాజీ ఎంపీలు బరిలో ఉండటంతో మానుకోట రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కాగా, బీజేపీ నుంచి బరిలో దిగుతున్న ఇద్దరు అభ్యర్థులు అరూరి రమేష్, సీతారాంనాయక్ బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన నేతలే. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన వారే. వరంగల్ బరిలో ఉన్న ముగ్గురు కూడా

- 'ఓరుగల్లు' ఉత్కంఠకు తెర దించిన బీఆర్ఎస్
- అభ్యర్థిగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించిన అధినేత
- ఇప్పటికే ప్రజల్లోకి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన హస్తం పార్టీ
- వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- గులాబీ కంచుకోటల్లో పాగాకు కాంగ్రెస్, బీజేపీ ఎత్తులు

ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారుతో వేడెక్కిన ఉమ్మడి జిల్లా రాజకీయం

బీఆర్ఎస్ నేపథ్యం ఉన్న వారే కావటం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎవరు ఓట్లకు ఎవరు ఎసరు పెడుతారో అనే ఉత్కంఠ కూడా అభ్యర్థుల్లో నెలకొంది. ఇక ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానవర్గం కుల సమీకరణలకు పెద్దపీటలు వేశాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మాదిగ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటంతో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆ సామాజిక వర్గం నేతలకే టికెట్లు కేటాయించాయి. మాదిగ ఉపకులం అభ్యర్థిని కాంగ్రెస్ బరిలో దించింది. మూడు పార్టీలు కూడా మాదిగ సామాజిక వర్గం నుంచే అభ్యర్థులను బరిలో దించటంతో మాల సామాజిక వర్గం ఓట్లు ఎటువైపు మొగ్గు చూపుతాయే అనేది చర్చనీయాంశంగా మారింది.



ప్రజాక్షేత్రంలోకి అభ్యర్థులు...

వరంగల్‌లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు, మహబూబాబాద్‌లో మూడు పార్టీలు అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావటంతో ప్రజాక్షేత్రంలోకి దిగారు. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. పరకాల, భూపాలపల్లి, స్టేషన్‌ఘనపూర్ తదితర నియోజక వర్గాల్లో నిర్వహించిన బూత్ కమిటీల సమావేశాల్లో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో తన చేరిక, తన కులం, మతంపై వస్తున్న ఆరోపణలు, విమర్శలను తిప్పికొడుతూ ప్రసంగాలు సాగిస్తున్నారు. ఇక ఊరూరా తిరిగి ఇంటింటి ప్రచారానికి

మిగతా 7వ పేజీలో..

బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపెల్లి

- జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌కు వరంగల్ లోక్‌సభ టికెట్
- అధికారికంగా ప్రకటించిన అధినేత కేసీఆర్



రాంనగర్, ఏప్రిల్ 12: వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్‌ను ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ అధినేత కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో వరంగల్ లోక్‌సభ పరిధిలోని బీఆర్ఎస్ నేతలతో భేటీ అయ్యారు. నేతల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత సుధీర్‌కుమార్ పేరును అధికారికంగా ప్రకటించారు.

కాగా, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను తొలుత బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ ఆమె అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఆపై కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ నుంచి బరిలో నిలిచారు. ఈ క్రమంలో పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను తిరిగి తీసుకువచ్చి బరిలో నిలపాలని మంతనాలు జరిపారు. బీఆర్ఎస్ నేతల సూచన మేరకు ఫామ్‌హౌస్ సమీపంలోని ఒక హోటల్‌లో రాజయ్య బస చేశారు. కేసీఆర్ పిలుపు కోసం వేచి ఉన్నాడు. కేసీఆర్ భేటీలో జిల్లా నేతలు సైతం రాజయ్య వైపే మొగ్గు చూపినప్పటికీ

మిగతా 7వ పేజీలో..

బయోడేటా

పేరు	:	మారపెల్లి సుధీర్ కుమార్
కులం	:	మాదిగ (ఎస్సీ)
పుట్టిన తేదీ	:	30-8-1962
విద్యార్హతలు	:	ఎం.డి. (యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్)
తండ్రి పేరు	:	మారపెల్లి జాన్
తల్లి పేరు	:	కిరీటమ్మ
భార్య	:	శోభారాణి(మెడికల్‌ఆఫీసర్)
కుమారుడు	:	సుజన్‌కుమార్ (బీటెక్)
కూతురు	:	సుకీర్తి (అసిస్టెంట్ సివిల్ సర్జన్)
నివాసం	:	ముల్కనూర్, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు

- నా బిడ్డగా కావ్యకు నా కులమే వర్తిస్తుంది
- నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు
- బీఆర్ఎస్ నుంచి డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తప్పుకుంటాం
- మాదిగ జాతి ద్రోహి మందకృష్ణ : కడియం శ్రీహరి



7

కడియం ఎమ్మెల్యే కాకముందే నేను కాంట్రాక్టర్‌ను..

- ఆయన ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు
- ఇన్నాళ్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఎందుకు గుర్తుకు రాలేదు?
- ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి
- వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్



7

సీకేఎం గ్రౌండ్‌లో ఫ్యాన్ పార్క్

- ఐపీఎల్ అభిమానుల కోసం ఏర్పాటు
- నేడు, రేపు ఎల్ఈడీ స్క్రీన్లపై క్రికెట్ మ్యాచ్‌ల ప్రదర్శన



మాట్లాడుతున్న చాగంటి శ్రీనివాస్

వడ్డెపల్లి, ఏప్రిల్ 12: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను తిలకించేందుకు నగర ప్రజల కోసం వరంగల్ సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో ఎల్ఈడీ స్క్రీన్‌లతో ఫ్యాన్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. బీసీసీఐ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూడీసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డబ్ల్యూడీసీఏ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు బీసీసీఐ అబ్జర్వర్ అనంత్‌దావే, డబ్ల్యూడీసీఏ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడారు.

ప్రతీ ఏటా ఐపీఎల్ సీజన్‌లో బీసీసీఐ ఫ్యాన్ పార్కు పేరుతో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి ప్రజలు తిలకించే విధంగా సన్నాహాలు చేపడుతోందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 50 నగరాల్లో ఎల్ఈడీ స్క్రీన్‌లతో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు తిలకించే విధంగా ఏర్పాట్లు చేశా రన్నారు. ఈ క్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో ఎల్ఈడీ స్క్రీన్‌లపైన వరంగల్ నగర ప్రజలు తిలకించే విధంగా ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. 32 అడుగుల భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు వారు వివరించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కావ్యను ఓడించేందుకే కేసీఆర్ వ్యూహం

- బీజేపీ గెలుపు కోసమే సుధీర్‌కుమార్‌కు టికెట్
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల అభిప్రాయం
- వరంగల్ లోక్‌సభ ఎన్నికపై డీసీసీ భవన్‌లో సమావేశం
- 22న కడియం కావ్య నామినేషన్‌కు సీఎం రాక



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 12: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతోనే ఏ మాత్రం ప్రజాదరణ లేని సుధీర్‌కుమార్‌ను కావాలనే డమ్మీ అభ్యర్థిగా కేసీఆర్ బరిలో నిలిపినట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి అభిప్రాయపడ్డారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలిపించాలనే వ్యూహంతో కేసీఆర్ పావులు కదిపారన్నారు. శుక్రవారం రాత్రి హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వరంగల్ లోక్ సభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్ష తన ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల అంతర్గత సమావేశం జరిగింది. సమావేశంలో ప్రధానంగా ఎన్నిక ప్రచార కార్యక్రమాలు, నిర్వహణ తీరు, కడియం కావ్య నామినేషన్, సీఎం రేవంత్‌రెడ్డి రాక తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ ప్రకటన విషయంలో సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై చేస్తున్న ప్రణాళికలను మరింత పట్టుదలతో సమష్టిగా గెలుపు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉన్నట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమావేశంలో వెల్లడించినట్లు తెలిసింది.

అలాగే కడియం కావ్య ఈ నెల 22న నామినేషన్ దాఖలు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. అంతకుముందు సన్నాహక సమావేశాలను ముమ్మరం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. బూత్ స్థాయి నుంచి కమిటీల నిర్మాణం 18లోగా పూర్తి జరగాలని నిశ్చయించారు. వాహనాల ర్యాలీలు, కళాబృందాలతో ప్రచారం, ప్రచార రథాల సమకూర్పు తదితర అంశాలను చర్చించారు. ఈ నెల 16న మడికొండలో ఎన్ఎస్‌యూఐ సమావేశం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమావేశానికి హాజరు కానున్నట్లు వెల్లడైంది. లోక్‌సభ ఎన్నిక క్రమంలో యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాలనే చర్చ జరిగింది. బీజేపీ ఎక్కువగా యువతను ఆకర్శిస్తున్న క్రమంలో ఆ దిశగా వ్యూహ రచన జరగాలని నిర్ణయించారు. అన్నివర్గాలకు చేరువ అవుతూనే ముఖ్యంగా దళిత వర్గాలతో మమేకం కావాలని, ఈమేరకు గ్రామస్థాయి నుంచి నియోజకవర్గాల వారిగా ప్రణాళికలను చేయాలనే నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సమావేశంలో లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు నాగరాజు, యశస్వినిరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఏఐసీసీ నాయకుడు కత్తి వెంకటస్వామి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ నాయకుడు నమిండ్ల శ్రీనివాస్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టరు రియాజ్, టీపీసీసీ నాయకుడు మోజెస్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

శుక్రవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 36.0°C	కనిష్ఠం : 24.5°C



గన్నేరు పూలతో లక్ష పుష్పార్చన

భద్రకాళికి లక్ష పుష్పార్చన

- నాలుగోరోజుకు వసంత నవరాత్రులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 12: భద్రకాళీ ఆలయంలో అమ్మవారికి నిర్వహిస్తున్న వసంత నవరాత్రులు నాలుగో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, జపహోమార్చనాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష గులాబీ రంగు గన్నేరు పుష్పాలు, చామంతి పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన గులాబీ రంగు గన్నేరు, చామంతి పుష్పాలతో పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి, సహాయ కమిషనర్ శేషుభారతి, అశేష భక్త వాహిని పాల్గొన్నారు.

బయోమైనింగ్ ప్రక్రియ పూర్తి చేయండి..

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- రాంపూర్ డంపింగ్ యార్డ్, ప్రశాంత్‌నగర్‌లోని ఎస్‌టీపీ సందర్శన



డంపిండ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 12: నిర్దేశిత గడువులో త్వరితగతిన సంబంధిత అధికారులు బయోమైనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శుక్రవారం రాంపూర్‌లోని డంపింగ్ యార్డ్‌ను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. బయోమైనింగ్ ప్రక్రియను అక్కడి అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వచ్చే జూన్ మాసం ముగిసేవరకు బయోమైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 3 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1లక్ష 87 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేశామన్నారు. ప్రతీ రోజు 2 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగించాలని సూచించారు. ప్రతీ రోజు ప్రాసెసింగ్ చేసిన చెత్తను నివేదిక ద్వారా తమకు అందించాలన్నారు. 66 డివిజన్‌ల నుంచి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించే క్రమంలో రోడ్డుపై చెత్త పడకుండా చూడాలని అన్నారు. వాహనాలపై కవర్లను ఉంచేలా చేయాలని సీఎంహెచ్‌వోను ఆదేశించారు.

అనంతరం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఎస్‌టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడి అధికారులు కమిషనర్‌కు ప్లాంట్ పనితీరును వివరించారు. ప్రతీ రోజు 5 ఎంఎల్‌డీ మురికి నీటిని శుద్ధి చేస్తున్నట్టు వెల్లడించారు. కమిషనర్ వెంట సీఎంహెచ్‌వో రాజేశ్, ఎస్ఈ ప్రవీన్‌చంద్ర, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, స్మార్ట్‌సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి, శానిటరీ సూపర్‌వైజర్లు పసునూరి బాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామితో పాటు సిబ్బంది ఉన్నారు.

బోనస్ భాగ్యమేదీ..?

- 'క్వింటాకు రూ.500' కోసం రైతుల ఎదురుచూపు
- ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం
- 207 కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో అధికారులు
- జిల్లాలో 1.12లక్షల ఎకరాల్లో వరి సాగు



ఖానాపురంలో సాగవుతున్న వరి సాగు

ఖానాపురం, ఏప్రిల్ 12: ధాన్యం మద్దతు ధరకు అదనంగా రాష్ట్రం ప్రభుత్వం అందించే బోనస్‌పై రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల హామీగా పేర్కొన్న కాంగ్రెస్.. అధికారంలోకి రావడంతో బోనస్‌పై అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పార్టీ మాట తప్పకుండా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం ఈ యాసంగిలో జిల్లాలో 1.11లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అధికారులు 207 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్‌లో ముందుగా వరి నాట్లు వేసుకున్న రైతుల వరి కోతలు ఏప్రిల్ మొదటి వారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో రెండో వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయి.

బోనస్ ప్రకటన కోసం ఎదురుచూపు

రైతులు కష్టపడి పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. కేంద్రం ప్రభుత్వ ధర ఏ గ్రేడ్ క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ప్రకటించింది. ఈ ధరతో రైతులు నష్టపోతారని భావించిన గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రైతుల ఉత్పత్తులకు మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. మేనిఫెస్టోలో కూడా పెట్టింది. దీంతో ఈ యాసంగి సీజన్ నుంచే ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందా, లేక మాట తప్పుతుందా అని రైతులు ఆందోళన చెందు తున్నారు. రూ.500 బోనస్ ఇస్తే రైతులకు అదనంగా ఆదాయం చేకూరుతుంది. ఎకరాకు 21నుంచి 28క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడి వస్తుంది. బోనస్ ఇస్తే ఎకరాకు రూ.10,500 నుంచి రూ.14వేల వరకు అదనపు ఆదాయం చేకూరుతుంది.

జిల్లాలో 207 కొనుగోలు కేంద్రాలు...

జిల్లాలో ఈ యాసంగిలో ధాన్యం కొనుగోలు కోసం 207 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 130 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీల ఆధ్వర్యంలో 57కొనుగోలు కేంద్రాలు, ఎఫ్‌పీసీఎల్‌ల ఆధ్వర్యంలో 19, మెప్మా ఆధ్వర్యంలో ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మండలాలవారీగా చూస్తే ఖానాపురంలో 19, దుగ్గొండిలో 18, నల్లబెల్లిలో 13, నర్సంపేటలో 18, చెన్నారావుపేటలో 11, పర్వతగిరిలో 27, నెక్కొండలో 18, రాయపర్తిలో 32, గీసుకొండలో 7, వరంగల్‌లో 1, వర్ధన్నపేటలో 21, సంగెంలో 18, ఖిలా వరంగల్‌లో 4చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అధికారుల అంచనా ప్రకారం ఈ యాసంగిలో 1,12,050 ఎకరాల్లో వరి సాగు చేశారు. 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయనున్నారు.

దళారులను నమ్మొద్దు..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ధాన్యం విక్రయాల కోసం ప్రైయివేటు వ్యాపారులను ఆశ్రయించి మోసపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే తరుగు, తాలు, తేమ పేరుతో మిల్లర్లు కోతలు విధిస్తుండంతో ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు రైతులకు డబ్బులు చెల్లించకుండానే చేతులెత్తేసి ఉడాయించిన సంఘటనలూ ఉన్నాయి. దీంతో అధిక ధరకు ఆశపడ్డ రైతులకు వ్యాపారులు చేతులెత్తేయడంతో మొదటికే మోసం వచ్చిన సందర్భాలున్నాయి.

ప్రభుత్వం బోనస్ అందించాలి

- వేములపల్లి ప్రకాశ్‌రావు, ఎంపీపీ, ఖానాపురం



వరి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులకు మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం అందించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు దాటింది. వరంగల్ డిక్లరేషన్ ఇచ్చిన ప్రకారం ప్రతీ వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ అదించి రైతులను ఆదుకోవాలి.

బోనస్ అమలు చేయకపోవడం సిగ్గుచేటు

- పెద్దారపు రమేష్, ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా బోనస్ రూ.500 అమలు చేయకపోవడం సిగ్గు చేటు. జిలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు నేపథ్యంలో తక్షణమే అమలు చేయాలి. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన మాటా ప్రకారం బోనస్‌ను అందించాలి.

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: పోలీసునంటూ భర్త లేని ఒంటరి మహిళను మోసం చేసిన ఘటనలో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్స్‌పెక్టర్ వై.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన మహిళతో రాజన్న సిరిసిల్ల జిల్లా చీర్లవంచకు చెందిన మామిడి కిరణ్ పోలీసునంటూ పరిచయం పెంచుకున్నాడు. వివాహం చేసుకొని, తన ఇంటిని బాధిత మహిళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుతానని మాయ మాటలు చెప్పి మహిళ నుంచి బంగారు ఉంగరం, పుస్తెలతాడు, చైన్ తీసుకున్నాడు. వివాహం విషయం ప్రస్తావించగానే ఇంకోసారి వివాహమంటే చంపుతానని బెదిరించి మహిళ నుంచి మరో లక్ష ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేని బాధిత మహిళ ఈనెల 7న ఫిర్యాదు చేయగా పక్కా సమాచారంతో శుక్రవారం ఉదయం హనుమకొండ బస్టాండ్‌లో నిందితుడి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. నిందితుడి నుంచి పుస్తెలతాడు, ఏపీ పోలీసుశాఖతో ఉన్న నకిలీ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ధార్మిక భవన్ స్థలంపై
కొత్త వివాదం

- స్థలం తమదంటున్న మేడారం జాతర పూజారులు
- వేదపాఠశాలను ధార్మిక భవన్‌లోకి తరలించకుండా మెలిక
- స్థలం తమదేనని దేవాదాయశాఖ అధికారుల స్పష్టం

హనుమకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ధార్మికభవన్ స్థలంపై కొత్త వివాదం తలెత్తింది. భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలను ధార్మిక భవన్‌లోకి తరలించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పూజారులు ఈ కొత్త వివాదానికి తెరతీశారు. ధార్మిక భవన్ నిర్మించిన స్థలం తమ దేననే వాదన లేవనెత్తారు. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతరకు సంబంధించి గెస్టుహౌస్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడానికి ఉద్దేశించి ఈ స్థలం అప్పట్లో ఇచ్చారని మేడారం పూజారులు వాదిస్తున్నారు. ధార్మిక భవన్‌లో వేద పాఠశాల ఏర్పాటు చేయడం ద్వారా రూ.కోట్ల విలువ చేసే ధార్మిక భవన్‌ను భద్రకాళి దేవస్థానానికి స్వాధీనం చేసేందుకు దేవాదాయ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నది వారి ఆలోచన. ఈ ప్రయత్నాలను ఆపకపోతే మేడారంలో విధులను బహిష్కరిస్తామని కూడా హెచ్చరిక చేశారు. మేడారం పూజారులు పెట్టిన ఈ మెలికతో ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలింపుపై అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది.

రికార్డుల్లో దేవాదాయ శాఖదే..

దేవాదాయ శాఖ వాదన మరో విధంగా ఉంది. ఈ స్థలం దేవాదాయ శాఖదేనని అధికారులు చెబుతున్నారు. స్థలానికి సంబంధించి అందుబాటులో ఉన్న రికార్డులు కూడా ఇదే చెబుతున్నాయి. సర్వే నెంబరు 725లో 1014 గజాల స్థలాన్ని 1993 సెప్టెంబర్ 30వ తేదీన అప్పటి కలెక్టర్ బి7/55/93 ద్వారా దేవాదాయ శాఖకు కేటాయించినట్టు రికార్డులు చెబుతున్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా వరంగల్-హనుమకొండ ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ఈ స్థలాన్ని వాస్తవానికి మొదట ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు జీవితబీమా సంస్థకు అప్పగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. అయితే అప్పటికే భద్రకాళి దేవస్థానం భక్తుల సౌకర్యార్థం ధర్మసత్రాల నిర్మాణానికి స్థలం కోసం కలెక్టర్‌కు వినతి చేసి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జీవిత బీమా సంస్థకు ఈ ఇక్కడ కాకుండా మరోచోట కేటాయించారు. ఆలా ఈస్థలం దేవాదాయ శాఖకు కేటాయించినట్టు సమాచారం.

లోకాయుక్తకు వెళతాం..

ధార్మిక భవన్‌పై మేడారం పూజారుల ఈకొత్త వివాదం వెనుక ఓ అధికారుల తెర వెనుక పాత్ర ఉన్నట్టు అనుమానం కలుగుతోందని కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజు అనుమానం వ్యక్తం చేశారు. మొదటి నుంచి వేద పాఠశాలను ధార్మికభవనంలోకి తరలించడం ఇష్టం లేనందువల్ల పరోక్షంగా మేడారం పూజారులను రెచ్చగొట్టడం ద్వారా అడ్డుపుల్ల వేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు కనిపిస్తోందన్నారు. అవసరమైతే దీనిపై లోకాయుక్తకు వెళతామని స్పష్టం చేశారు.

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు

● కులం, మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయొద్దు.. ● నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు.. ● మీడియాతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి


డీసీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 12: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తన కూతురు వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య కులం, వివాహం వంటి వ్యక్తిగత విషయాలపై రమేశ్ మాట్లాడడం అనైతికమని ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన అరూరి రమేశ్‌పై విరుచుకుపడ్డారు. కావ్య వరంగల్‌లో జన్మించి ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసిందన్నారు. వర్ధన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టరుగా పని చేసిందన్నారు. కావ్య ముస్లింను వివాహం చేసుకున్న విషయాలపై అరూరి రమేశ్ ఇష్టారాజ్యంగా మాట్లాడడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, విమర్శలు ఉంటాయని, కానీ వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడం అనైతికమని పునరుద్ఘాటించారు. కబ్జాల చరిత్ర ఉన్న రమేశ్‌ను ఊళ్లలోకి రానివ్వకుండా ప్రజలు ఎదురు తిరిగారని చెప్పారు. అలాంటి చరిత్ర తమకు లేదన్నారు.

కడియం కావ్య వివాహం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ మేరకు జరిగిందని శ్రీహరి వివరించారు. ఈ చట్టం ప్రకారం మతాంతర వివాహం జరిగినప్పటికీ భార్యభర్తలు ఎవరికి వారు తమ మతాన్ని ఆరాధించుకోవచ్చని తెలిపారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మతం మారినా కులం మారదని వివరించారు. పిల్లలకు తండ్రి కులమే వర్తిస్తుందన్నారు. ఈ మేరకు తన బిడ్డగా కడియం కావ్యకు తన కులమే వరిస్తుందని కడియం శ్రీహరి వివరించారు. రాజ్యాంగం, చట్టాలపై అవగాహన లేని అరూరి రమేశ్.. ఇతర బీజేపీ నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కావ్య మతం, కులం, ప్రాంతం విషయంలో చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కడియం కావ్య ఎస్సీ కాదని నిరూపించగలరా? అంటూ శ్రీహరి సవాల్ విసిరారు. ఎవరెన్ని చిల్లర రాజకీయాలు చేసినా కావ్య గెలుపు ఖాయమైందని శ్రీహరి ధీమాగా చెప్పారు.

అరూరి రమేశ్ క్లాస్-1 కాంట్రాక్టర్‌గా, ఆ తరువాత రాజకీయంగా, ఎమ్మెల్యే స్థాయికి ఎదిగింది తన వల్లేనని శ్రీహరి చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు చెప్పి 2014లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించినట్లు తెలిపారు. తాను ఎవరికీ వెన్నుపోటు పొడవలేదన్నారు. నిజాయితీ, నైతిక విలువలే తనకు రాజకీయ అవకాశాలు తెచ్చిపెట్టాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల నుంచి తాను డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కడియం శ్రీహరి కొట్టి పారేశారు. డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే వరంగల్ లోకసభ నుంచి కడియం కావ్య తప్పుకుంటుందని స్పష్టం చేశారు. మంద కృష్ణ మాదిగ జాతి ద్రోహి అని కడియం శ్రీహరి ఆరోపించారు. దళితులు, ముస్లింలు ఇతర మైనారిటీలపై బీజేపీ అరాచకంగా వ్యవహరిస్తుంటే.. ఆ పార్టీ పంచన ఎలా చేరుతారని శ్రీహరి ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ దళిత జాతి ఉద్ధారకుడని ఎలా అంటామని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ము కాస్తూ దళిత జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు.

రమేశ్‌కు ఓటమి భయం పట్టుకుంది

బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు ఎన్నికకు ముందే ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. తన వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడంలోనే రమేశ్ పతనం ప్రారంభమైందన్నారు. ఆయనకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. వర్ధన్నపేటలో భూకబ్జాలు చేసింది చాలక ఇక మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కబ్జాల కోసమే ఎంపీగా పోటీ చేస్తున్నాడని రమేశ్‌పై మండిపడ్డారు.

కావ్య గెలుపునకు కృషి

డాక్టరు కావ్య విజయం కోసం సమష్టిగా కృషి చేస్తున్నట్లు వరంగల్ లోకసభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కావ్య వ్యక్తిగత విషయాలపై బీజేపీ, బీఆర్ఎస్ నోరు పారేసుకోవడం ఆ పార్టీల అభద్రతకు సంకేతమన్నారు. బీఆర్ఎస్ అవినీతి ఊబిలో కూరుకుపోయిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు డొల్లతనం బట్టబయలైందన్నారు. కవిత లిక్కర్ కేసులో చిక్కుకుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో పెద్ద తలకాయ ఒకటి రెండు రోజులు బయటపడనుందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కరువు యాత్ర పేరిట రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కావ్య మూడు లక్షల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కబ్జాల చరిత్ర ఉన్న అరూరి రమేశ్‌కు కడియం శ్రీహరి, కావ్యను విమర్శించే నైతిక హక్కు లేదని విమర్శించారు. కబ్జాల పాపం వల్లే అరూరి రమేశ్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని, ఎంపీగా కూడా ఇదే అనుభవం ఆయనకు దక్కనుందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కబ్జాలకు పాల్పడిన రమేశ్ బీజేపీలో చేరగానే పునీతుడు కాలేడని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మండిపడ్డారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి, వర్ధన్నపేట ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, కార్పొరేటర్ తోట వెంకన్న, బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కడియం ఎమ్మెల్యే కాకముందే
నేను కాంట్రాక్టర్‌ను..

కడియం ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు.. ● ఇన్నాళ్లు అండర్ డ్రైనేజీ ఎందుకు గుర్తురాలేదు? ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి.. ● వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఆరూరి రమేశ్


మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: కడియం శ్రీహరి ఎమ్మెల్యే కాకముందే 1991లో తాను క్లాస్‌వన్ కాంట్రాక్టర్‌నని, తన ఎదుగుదలలో ఎవరి ప్రమేయం లేదని స్వయంకృషితో, ప్రజల ఆశీస్సులతో రాజకీయ ప్రతినిధిగా ఎదిగానని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ చెప్పారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం లోక్‌సభ కన్వీనర్ కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగింది.

ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. ప్రతీసారి నీతి, నిజాయితీకి కేరాఫ్‌గా చెప్పుకుంటున్న కడియం.. వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించాడో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 40 ఏళ్లుగా మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీగా అధికారం అనుభవించి.. ఏనాడూ అండర్ డ్రైనేజీ మాట మాట్లాడనోడు.. ఇవాళ అండర్‌డ్రైనేజీ నిర్మిస్తానని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ టికెట్ ఇస్తే.. ఏంతీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరాడని ప్రజలు చర్చించుకుంటున్నారని విమర్శించారు. మూడోసారి ప్రధాని కాబోతున్న మోదీ బృందంలో ప్రతినిధిగా వరంగల్ నుంచి పంపిస్తే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సంగెం, మడికొండ టెక్స్‌టైల్ అభివృద్ధితోపాటు మామునూర్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, ఈ ప్రాంత యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. 10 ఏళ్ల వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే.. ఏ విధంగా అభివృద్ధి చేశానో.. ఎంపీగా అవకాశం ఇస్తే రెట్టింపు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర నాయకులు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

నెంబర్ వన్ స్థానంలో వరంగల్

దేశంలోనే వరంగల్ లోక్‌సభ నెంబర్‌వన్ స్థానంలో నిలవబోతుందని తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు, రాష్ట్రంలో 12 సీట్లు బీజేపీ కైవసం చేసుకోబోతోందని జోస్యం చెప్పారు. కాగా, అంతకుముందు మండల, డివిజన్, బూత్ అధ్యక్షుల ఇంటింటికీ ప్రచారంపై అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల వివరాలు, ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా బూత్ అధ్యక్షుల దగ్గర ఉండాలన్నారు. ప్రతీ ఇంటికి మోదీ, అభ్యర్థితో ఉన్న స్టిక్కర్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు ధర్మారావు, గరికపాటి మోహన్‌రావు, చాడ సురేశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, మురళీధర్, విజయరామారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, దశమంత్‌రెడ్డి, నిషిధర్‌రెడ్డి, నాయకులు కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కొండేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓట్లు వేయొద్దు

న్యూశాయంపేట, ఏప్రిల్ 12: మాదిగల వ్యతిరేక పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓట్లు వేయొద్దని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ సమాజానికి పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాదిగలను రాజకీయంగా అణచివేస్తోందని, అలాంటి కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో మాదిగలంతా ఏకమై చిత్తుగా ఓడించాలన్నారు. మాదిగలకు మొదటగా టికెట్ ఇవ్వని బీఆర్ఎస్ పార్టీకి కూడా ఓట్లు వేయొద్దన్నారు. ఈ నెల 15వ తేదీన పరకాలలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల లోక్‌సభ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, పెద్ద సంఖ్యలో మాదిగ కులస్థులు హాజరై విజయవంతం చేయాలని మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ వరంగల్ ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఏకు శంకర్, చేతల్ల రమేష్, శివ, శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


గవిచర్ల మోడల్ స్కూల్ ల్యాబ్‌లో పాఠ్యాంశాలను నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

అటకెక్కిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు

అవగాహన లేకపోవడంతోనే పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని వైనం
ఆన్‌లైన్‌తో ఏమీ చేయాలో తెలియని అవగాహన రాహిత్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ తూతూమంత్రంగా సాగుతోంది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించి సృజనాత్మకతతో కూడిన వినూత్న ఆవిష్కరణలను సృష్టించే వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పేరుతో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను శాస్త్రీయ, సాంకేతిక రంగాల వైపు అడుగులు పడేందుకు వారిని ఆ మేరకు ప్రోత్సహించేందుకు ఈ ల్యాబ్‌లను ఉపయోగించాలని సూచిస్తోంది. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలలకు మంజూరు చేస్తుంది. ల్యాబ్ ఏర్పాటైన తర్వాత ఒక్కో యేడాదికి రూ.2లక్షలను నిర్వహణ ఖర్చుల కింద మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం ఆరు పాఠశాలలు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపిక కాగా, ఇప్పటివరకు రెండు పాఠశాలల్లో మాత్రమే ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన నాలుగు పాఠశాలల్లో వాటి ఊసే లేదు. హనుమకొండ జిల్లాలో నాలుగు ఎంపిక కాగా, రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలు పూర్తిగా ఆన్‌లైన్‌తోనే ముడిపడి ఉండటం, రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండటం లేదు. దీంతో ఎంపికైన పాఠశాలల్లో సైతం ల్యాబ్‌ల ఏర్పాటు జరగడం లేదు.

అంతా ఆన్‌లైన్‌తోనే ఇబ్బంది

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లనే ఏర్పాటు చేసుకోవాలంటే సంబంధిత నీతి ఆయోగ్ వెబ్‌సైట్‌లోనే విధివిధానాలు పొందుపరిచి ఉంటాయి. ఇక పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈపథకానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియదు. వారి పర్యవేక్షణ లేకుండానే కేంద్ర ప్రభుత్వం నేరుగా పథకాన్ని అమలు చేస్తుంది. దీంతో టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉన్న పాఠశాలలు సైతం దరఖాస్తు చేసుకోలేకపోతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులకే అవగాహన లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు సైతం ఎలాంటి ముందస్తు అవగాహన కల్పించలేకపోతున్నారు. అవగాహన రాహిత్యంతో ల్యాబ్‌ల ఏర్పాటుకు అడ్డంకిగా మారుతుంది.

శాస్త్రీయభావాన్ని పెంపొందించేందుకు..

పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ భావాన్ని పెంపొందుతుంది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం కూడా అదే. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ భావన పెంపొందించి తద్వారా వినూత్న ఆలోచనలతో సృజనాత్మక ఆవిష్కరణలు చేస్తారనే ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు పూనుకుంది. పాఠశాలల్లోనే శాస్త్ర, సాంకేతిక వాతావరణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను వినూత్న ఆవిష్కరణలవైపు పయనించేలా చేయడమే టింకరింగ్ ల్యాబ్‌ల ఆశయం.

ఏర్పాటుకు రూ.12లక్షలు, నిర్వహణకు రూ.2లక్షలు

కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో తొలుత ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలలకు మంజూరు చేస్తుంది. ఆ తరువాత ప్రతీ యేడు నిర్వహణ ఖర్చుల కింద రూ.2లక్షల నిధులు మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లాలో మొత్తం ఆరు పాఠశాలలు ఈ పథకానికి ఎంపిక కాగా, రెండు పాఠశాలల్లోనే పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటు అయ్యాయి. మిగతా నాలుగు పాఠశాలల్లో ఎలాంటి ముందడుకు పడలేదు. గవిచర్ల, పర్వతగిరి మోడల్ స్కూళ్లలో టింకరింగ్ ఏర్పాటు అయ్యాయి. ఇక ఎంపికైన ఖానాపురం మండలం బుధరావుపేట మోడల్ స్కూల్, ధర్మారం జడ్పీహెచ్ఎస్, నెక్కొండ జడ్పీహెచ్ఎస్, నర్సంపేటలోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు అడుగులు పడలేదు. ఇక హనుమకొండ జిల్లాలో నాలుగు టింకరింగ్ ల్యాబ్‌లకు ఎంపిక కాగా, కేవలం మడికొండలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, ఎల్కతుర్తిలోని మోడల్ స్కూల్లో మాత్రమే టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి.

మాకు సమాచారం ఉండటం లేదు..

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు సంబంధించిన ఎలాంటి సమాచారం మాకు అందుబాటులో ఉండటం లేదని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. అలాగే జిల్లా సైన్స్ అధికారులకు సైతం ఎలాంటి సమాచారం ఉండటం లేదని వారు చెబుతున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. మాకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించలేకపోతున్నాము. ఆసక్తి కలిగిన ప్రధానోపాధ్యాయులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తున్నారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపికయ్యాయనే కనీస సమాచారం సైతం మాకు అందుబాటులో ఉండటం లేదు.



కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో నాయకులతో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నిరుత్సాహంలో తాటికొండ రాజయ్య

ఎర్రవెల్లికి వెళ్లి వెనుదిరిగిన మాజీ ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ టికెట్ విషయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు చుక్కెదురైంది. కేసీఆర్ నుంచి ఏ క్షణం లోనైన ఫోన్ వస్తుందని, అందుబాటులో ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమాచారం ఇచ్చారు. అయితే హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ కేసీఆర్‌తో ఫామ్‌హౌస్‌లో చర్చలు జరుపుతున్నాడనే విషయం తెలుసుకున్న రాజయ్య.. ఎర్రవెల్లికి వెళ్లకుండా సమీప గ్రామంలో నాయకులతో కలిసి వేచి ఉన్నాడు. ఈ క్రమంలోనే వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ పేరు కేసీఆర్ ప్రకటించడంతో అసహనానికి గురైన రాజయ్య ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలువకుండానే వెనుదిరిగి వచ్చారు. కాగా కేసీఆర్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బాధ్యతలు, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి గెలుపు బాధ్యతలు రాజయ్యను తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. రాజయ్య వెంట వెళ్లిన నాయకులు ఆకుల కుమార్, చల్లా చందర్ రెడ్డి, కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, కనకం గణేష్, రంగు హరీష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన మహిళ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో చాపర్తి సాంబలక్ష్మీ (56) అనే కూలీ మృతిచెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సాంబలక్ష్మీ శుక్రవారం ఉదయం ఇళ్లలో పనిచేసి వస్తూ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద కూరగాయలు తీసుకుంటుండగా ఆటో వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ఫోన్ చేసి ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సాంబలక్ష్మీ మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: నిబంధనలు ఉల్లంఘించిన 17 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాకూర్ తెలిపారు. 17 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మందికి 17,300, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ.4,200 జరిమానాను విధించారన్నారు.

ఇక సమరమే!



(5వ పేజీ తరువాయి)

కావ్య ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సైతం ఇప్పటికే అన్ని నియోజకవర్గాలల్లో ఒకసారి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ స్థాయిలో బూత్ కమిటీల సమావేశాలు కూడా నిర్వహించి కార్యకర్తల్లోకి చొచ్చుకు పోతున్నారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేసేందుకు తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి శుక్రవారమే ఖరారవటంతో గెలుపే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో దిగి గులాబీ పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది.

మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ముఖ్యనేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ గెలుపునకు సహకరించాలని, గెలిస్తే నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్నారు. మండుటెండలో కూడా అభ్యర్థులు ప్రచారంలో చెమటోడ్చుతున్నారు.

ఓట్ల లెక్కల్లో నేతలు..

2009లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ పార్లమెంట్ స్థానం పరిధిలో వరంగల్ లోక్‌సభ ఏర్పడింది. తొలుత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2016 (ఉపఎన్నిక), 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అలాగే మహబూబాబాద్ నుంచి 2009లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఒక చోట బీఆర్ఎస్ విజయం సాధించింది. మొత్తం కాంగ్రెస్‌కు 6,61,545ఓట్లు పోలవగా, బీఆర్ఎస్‌కు 5,02,578ఓట్లు వచ్చాయి. ఇక బీజేపీకి 1,56,353ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 1,58,967ఓట్ల ఆధిక్యాన్ని కాంగ్రెస్ సాధించింది. అయితే వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో బీజేపీకి గణనీయమైన ఓట్లు పోలయ్యాయి. దీంతో పాటు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ చేరికతోపాటు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉండటంతో వర్ధన్నపేటలో కూడా బీజేపీకి కొంత బలం పెరిగిందనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరటంతో పాటు తన కూతురు కావ్యను ఎంపీ అభ్యర్థిగా బరిలో దించటంతో కాంగ్రెస్‌కు అదనపు బలంగా భావిస్తున్నారు. దీంతో వరంగల్ పార్లమెంట్ స్థానంలో ట్రయింగిల్ ఫైట్ ఏర్పడింది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో కూడా ఏడింటిలో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా, ఒక చోట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 6,85,897ఓట్లు పోలు కాగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు వచ్చాయి. బీజేపీకి ఇక్కడ కేవలం 34,426 ఓట్లే పోలయ్యాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 2,41,987ఓట్ల ఆధిక్యతను కాంగ్రెస్ సాధించింది. అయితే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరటంతో కాంగ్రెస్‌కు అనదపు బలం చేకూరిందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీలకు సంప్రదాయంగా వస్తున్న ఓట్లను పరిగణంలోకి తీసుకుని ఆయా పార్టీల నేతలు గెలుపు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.

2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు ఆయా పార్టీలకు పోలైన ఓట్లు

లోక్‌సభ స్థానం	సంవత్సరం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	2009	3,96,568	2,71,907	1,35,697(టీడీపీ)
వరంగల్	2014	2,69,065	6,61,639	1,87,139
వరంగల్	2016	1,56,315	6,15,403	1,29,868
వరంగల్	2019	2,62,200	6,12,498	83,777
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,61,545	5,02,578	1,56,353
మహబూబాబాద్	2009	3,94,447	3,25,490(సీపీఐ)	1,45,299(పీఆర్పీ)
మహబూబాబాద్	2014	2,85,577	3,20,569	2,15,904 (టీడీపీ)
మహబూబాబాద్	2019	3,15,446	4,62,109	25,487(బీజేపీ)
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,85,897	4,43,910	34,426(బీజేపీ)

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మారపెల్లి



(5వ పేజీ తరువాయి)

కేసీఆర్ విముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కేసీఆర్ అనూహ్యంగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించడంతో నేతలంతా అధినేత నిర్ణయానికి తప్పనిపరిస్థితిలో ఒప్పుకున్నట్లు సమాచారం. మొత్తంగా రాజయ్యకే వరంగల్ ఎంపీ టికెట్ వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో కేసీఆర్ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడం గమనార్హం.

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన సుధీర్‌కుమార్ ప్రస్తుతం హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. భీమదేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా (1995-2000), కరీంనగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా (2001-2006) కాలంలో పదవిలో ఉన్నారు. 2001 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న సుధీర్‌కుమార్.. మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు ప్రధాన అనుచరుడు.

సుధీర్‌కుమార్‌కు కేసీఆర్ ఫోన్

సుధీర్‌కుమార్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోన్ చేసి ఆశీర్వదించారు. సుధీర్‌కుమార్ నివాసం, విద్యాభ్యాసం, వరంగల్‌తో ఉన్న అనుబంధం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని తేలిందన్నారు. వరంగల్‌లో గెలిచేది బీఆర్ఎస్ అని ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలను వెళ్లి కలవాలని కేసీఆర్ సూచించారు. 15న సమన్వయ కమిటీ సమావేశం ఉంటుందని, జిల్లా నేతలను అందరిని కలిసి సహకారం తీసుకుని విజయం సాధించాలని కేసీఆర్ సూచించారు. కాగా, ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు, సహకరించిన జిల్లా నేతలకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


పూజలు నిర్వహిస్తున్నస్వాములు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 12: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎస్ ఆర్‌నగర్‌లో శ్రీ గణపతి, సుబ్రమణ్య, శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం త్రిదండి శ్రీనివాస ప్రతదర్ నాయరణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆహ్వానిత హోమం, ఉపచార పూజలు, అణుష్ఠాణాలు, జలాదీనబాండ ఉద్వానన, అభిషేకం, అలంకరణ, హిరణ్యదిన, ఊరేగింపు, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

- బస్సులు, పెట్రోలియం, రైల్వే గూడ్స్ నుంచి భారీ వాహనాల రాకపోకలు
- రద్దీగా మారిన బస్టాండ్ సర్కిల్
- ఆవరణ ఇరుకుతో కష్టంగా మారిన బస్సుల రివర్స్
- కానరాని మౌలిక వసతులు.. భద్రత చర్యలు

ప్రయాణం వెంటే... ప్రమాదం


ఎదురెదురుగా ఆయిల్ ట్యాంకర్, బస్సు

గిర్మాజిపేట, ఏప్రిల్ 12: వరంగల్ ఆర్టీసీ తాత్కాలిక బస్ స్టేషన్ ప్రమాదభరితంగా మారింది. ప్రస్తుతం బస్టాండ్‌ను రూ.75కోట్లతో పునర్నిర్మాణం నేపథ్యంలో వరంగల్ ఎస్ఎన్ఎం క్లబ్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై తాత్కాలిక బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఒకవైపు భారత్ పెట్రోలియం డిపో పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లు మరోవైపు సిమెంట్, యూరియా, ట్రాక్టర్లు, లారీల రాకపోకలు సాగిస్తున్న మార్గంలోనే బస్‌లు తిరుగుతుండటంతో నిత్యరద్దీగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్లాట్‌ఫాం నుంచి బస్సులను రివర్స్ తీసుకోవడం కష్టంగా మారుతోంది. అధికారులు ఇక్కడ భద్రత చర్యలు చేపట్టక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

నిత్యం 30 వేల మంది ప్రయాణికులు..

రైల్వే గూడ్స్ షెడ్ పక్క నుంచి రైల్వేస్టేషన్ వరకు రైల్వే గోడకు ఆనుకుని షెడ్లతో ఆర్టీసీ లాజిస్టిక్ కార్యాలయం, బస్‌స్టేషన్ కార్యాలయం, కంట్రోల్ రూం, బస్‌ల రాకపోకలకు 17 ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేశారు. నిత్యం 600కు పైగా బస్సుల్లో సుమారు 30వేల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. అయినా ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు వైఫల్యమయ్యారు. అవసరమైన టాయిలెట్లు, తాగునీరు సదుపాయం కల్పించలేదు.

పొంచిఉన్న ప్రమాదం..

తాత్కాలిక బస్‌స్టేషన్ సమీపంలోనే భారత్ పెట్రోలియం డిపో ఉంది. ఇక్కడి నుంచి ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 భారత్ పెట్రోలియం డీజిల్, పెట్రోల్ బంక్‌లకు నిత్యం 200ట్యాంకర్ల ద్వారా సరఫరా అవుతుంది. డిపోలో డ్రైవర్లు, అధికారులు,సిబ్బందికి చెందిన 100కు పైగా కార్లు, ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. దీని పక్కనే ఉన్న రైల్వే గూడ్స్ షెడ్‌కు గూడ్స్ రైళ్ల ద్వారా సిమెంట్,యూరియా, ట్రాక్టర్లు వస్తుంటాయి. వీటిని తీసుకుపోయేందుకు రోజుకు 200 వరకు భారీ లారీలు రాకపోకలు చేస్తుంటాయి. వీటికి తోడు ఇందులో పనిచేసే హమాలీలు, కార్మికులు, రైల్వే సిబ్బంది వాహనాలు సుమారు 200 కూడా రైల్వే గూడ్స్ షెడ్ నుంచి రాకపోకలు చేస్తుంటాయి. వీటికి తోడు నిత్యం 600 ఆర్టీసీ బస్సులు రాకపోకలు చేస్తుంటాయి. నర్సంపేట వైపు బస్సులు వస్తుండగానే పెట్రోల్ డిపోల నుంచి ఆయిల్ ట్యాంకర్లు, రైల్వే గూడ్స్ షెడ్ నుంచి లారీలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నంత పనిచేస్తున్నాయి. దీనికి తోడు జంక్షన్ పాయింట్ కూడా ఇక్కడ వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగానే ఉంది. ప్లాట్‌ఫారాలపై బస్సులు ఉన్నప్పుడు స్థలం లేక బస్సులురామ్‌కీ ముందు రోడ్డుపై బారులు తీరుతున్నాయి.


వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న సర్కిల్

రివర్స్ కష్టమే..

బస్ స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల నుంచి రివర్స్ తీయాలంటే కష్టంగా మారింది. ఎస్ఎన్ఎం క్లబ్ ముందు భాగంలో టాయిలెట్ల వరకు బస్‌స్టేషన్‌లోనే ఫుట్‌పాత్ హోటళ్ల ఏర్పాటు చేయడంతో అసలే ఇరుకుగా ఉన్న ఆవరణ మరింత ఇరుకుగా మారింది. దీంతో బస్‌లను రివర్స్ చేయడం కష్టమవుతోంది. గత వారం బస్ రివర్స్ చేస్తుండగా టాయిలెట్ గోడ ధ్వంసమైంది. ఆ సమయంలో ప్రయాణికులెవరూ టాయిలెట్‌లో లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. అంతేకాకుండా నర్సంపేట నుంచి ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు బస్ స్టేషన్‌లో నుంచే రైల్వేస్టేషన్ వైపు రాకపోకలు చేస్తుండటంతో బస్‌ల రాకపోకలు ఇబ్బందికరంగా మారింది.


రైల్వే గూడ్స్‌షెడ్ నుంచి ఎదురుగా వస్తున్న లారీ


బస్ స్టేషన్‌లో బస్సులు

పెరుగుతున్న కూరగాయల ధరలు


లక్ష్మీపురం మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 12: కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం కూరగాయల్లో బీన్సీస్, దేశీ చిక్కుడుకు భలే గిరాకీ ఉంది. నాలుగు రోజుల క్రితం వరకు కిలో రూ.45 నుంచి రూ.50 పలికిన బీన్సీస్, దేశీచిక్కుడు గురువారం ఏకంగా కిలో రూ.60 నుంచి రూ.70 పలికింది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.చామగడ్డ, కాకరకాయ ధరలు కిలో రూ.35 నుంచి రూ.45 పలుకుతోంది. బీన్సీస్ ధరలు ఇంత పెరగడానికి కారణం అందులో పోషకపదార్థాలు ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు అంతధర పెట్టి కొనుగోలు చేస్తారని వ్యాపారులు చెపుతున్నారు.



లక్ష్మీపురంలో 10కిలోల ధరలు ఇలా..

కూరగాయలు	గరిష్ట	కనిష్ట
టమాట	రూ.120	రూ.100
పచ్చిమిర్చి	రూ.250	రూ.200
దేశీ చిక్కుడు	రూ.650	రూ.600
గోరు చిక్కుడు	రూ.250	రూ.200
క్యాబేజీ	రూ.200	రూ.180
బెండకాయ	రూ.100	రూ.80
కాకరకాయ	రూ.300	రూ.260
వంకాయ	రూ.200	రూ.160
బీన్సీస్	రూ.650	రూ.600
క్యారేట్	రూ.350	రూ.300
కీరా దోస	రూ.120	రూ.100
బీట్‌రూట్	రూ.250	రూ.200
ఆలుగడ్డ	రూ.200	రూ.180
చామగడ్డ	రూ.450	రూ.400
బీరకాయ	రూ.200	రూ.150
దోసకాయ	రూ.150	రూ.120
దొండకాయ	రూ.160	రూ.120
క్యాప్సికం	రూ.500	రూ.450

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 12: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఈ నెల 14న ఆదివారం బల్దియా కార్యాలయంలో ఘనంగా నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ జేఏసీ జిల్లా నాయకుడు రాజారపు భాస్కర్ పిలుపునిచ్చారు. బల్దియా కార్యాలయలో శుక్రవారం విలేకరులతో భాస్కర్ మాట్లాడారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఆదివారం ఉదయం నిర్వహించే అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి అన్ని కార్మిక, కుల, ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు హాజరుకావాలని భాస్కర్ పిలుపునిచ్చారు.

ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి: రేవూరి

గీసుగొండ, ఏప్రిల్ 12: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని, భవిష్యత్తులో వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. హన్మకొండలోని ఎమ్మెల్యే నివాస గృహంలో కొమ్మాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బస్కే సాంబయ్య, కందూరి రమేష్, మామునూరి సుధాకర్, శ్రీనివాస్, తగరపు రాజు తదితరులకు రేవూరి కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ గోపాల్, నాయకులు సాయిలి ప్రభాకర్, నాగారపు స్వామి, మహిళా అధ్యక్షురాలు జక్కుల సరిత, ఉండ్రాతి స్వామి, స్వామి, కిరణ్ పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న రేవూరి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్ రెడ్డి

'బీఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి'

గిర్మాజిపేట, ఏప్రిల్ 12 : రాజకీయాల్లో నీతి, నిజాయితీలకు తిలోదకాలిచ్చిన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో తిరస్కరించి ఎంసీపీఐ(యు), బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ లోక్‌సభకు తమ అభ్యర్థి మాస్ సావిత్రిని గెలిపించాలని కోరారు. శుక్రవారం అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో పార్టీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ నర్ర ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఎంసీపీఐ(యు), బీఎల్ఎఫ్ సమావేశంలో ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ లాంటి పార్టీలు రాజకీయాలను వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. సమావేశంలో ఎంసీపీఐ(యు) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, వరంగల్ లోకసభ అభ్యర్థి మాస్ సావిత్రి, కేంద్ర కమిటీ సభ్యులు జి.కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, సభ్యులు ఎస్.రవిందర్, జి.నాగార్జున, బీఎల్ఎఫ్ జిల్లా నాయకురాలు వి.రాగసుధ, జగదీశ్వర్, నగేష్ పాల్గొన్నారు.

ధర్మారంలో ఉచిత వైద్యశిబిరం

గీసుగొండ, ఏప్రిల్ 12: ధర్మారం జనప్రియ హాస్పిటల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని వాసవిక్లబ్, దర్శన్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 116 మందికి కంటి, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ రాజేష్, జోన్ చైర్మన్ కరుణాకర్, కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు పుల్లూరి రమేష్, కార్యదర్శి భద్రయ్య, కోశాధికారి మురళీధర్ పాల్గొన్నారు.


శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హరిత కాకతీయ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

కాళోజీజంక్షన్, ఏప్రిల్ 12: హనుమకొండ నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌లో శుక్రవారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభమైంది. సహజ నారపట్టు వస్త్రాల ప్రదర్శన, విక్రయాలు ఎక్స్‌పోలో అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శన ఈనెల 17 వరకు కొనసాగనుంది. ప్రదర్శనలో చీరలు, వస్త్రాలు, దుస్తులు, హోం లెనిన్, యాక్సెసరీస్ ఉన్నాయి. ధ్రువీకృత శ్రేష్ఠమైన పట్టు ఉత్పత్తుల తయారీ దారులచే దేశం నలుమూలల నుంచి ఒకే చోట బనారస్, కాంచీపురం, బీహార్ తాస్సార్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ బైలు, హ్యాండ్ పెయింటెడ్ చీర, ధాకాయి జంధాని, పైథాని, చందేరి, హ్యాండ్ కలంకారి మరెన్నో చేతనదారుల అద్భుతాలు ప్రదర్శించ బడుతున్నాయి. ఈసొకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు.


ఎక్స్‌పోలో వస్త్ర ప్రదర్శన

'హామీలు నెరవేర్చని ప్రభుత్వాలు'


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 12 : ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలం వెల్లదీస్తున్నాయని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను కుల, మతాల పేరుతో విడదీస్తూ ప్రజల మధ్య మతకలహాలను సృష్టిస్తున్నాయని ఆరోపించారు. దేశసంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. దోపిడీ పీడనలపై ప్రశ్నిస్తున్న ప్రజలను, ప్రజానాయకులపై అక్రమ కేసులు మోపి జైలుపాలు చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ బాధ్యుడు కుమార్, ఎంఎస్‌పి జిల్లాఅధ్యక్షుడు ప్రణయదీప్, ఎల్‌హెచ్ పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసూనాయక్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు జావిద్, డీటీఎఫ్ నాయకుడు రఘుపతి, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్, గౌడ జనహక్కుల పోరాట సమితి నాయకుడు రాజు, యాదవ కుల పోరాట సమితి నాయకుడు రాజుయాదవ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ


కుట్టు మిషన్ అందజేస్తున్న సభ్యులు

మట్టెవాడ, ఏప్రిల్12: ఫళని సేవాదళ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసినట్లు ఫళని సేవాదళ్ ఫౌండేషన్ అధ్యక్షుడు బొట్ల రవీంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం వరంగల్‌లో సభ్యుడు పుల్లూరి మధు ఆరుగురు మహిళలకు పంపిణీ చేశారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా ఫళని సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతీ అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు స్వయం సంవృద్ధి సాధించేందుకు కుట్టు మిషన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్బతి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

దేవుళ్ల విగ్రహాల ఊరేగింపు


ఊరేగించే విగ్రహాలకు పూజలు

సంగెం, ఏప్రిల్ 12: గాడెపల్లిలో శుక్రవారం దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీకోదండ రామచంద్రస్వామి విగ్రహాలను ఊరేగించారు. గణపతి హనుమాన్, లక్ష్మణ, సీత సమేత రామచంద్రా స్వామి శివలింగం నందీశ్వర పంచముఖ నాగేంద్ర స్వామి, నవగ్రహా శిఖర కలశ ప్రతిష్ఠ విగ్రహాలను ఊరేగించారు. హోమంలో 150 మంది జంటలు, 15 మంది పండితులు, పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య

చెరువులో పడి యువకుడి మృతి

కరీమాబాద్, ఏప్రిల్ 12: రంగశాయిపేట మద్దెలకుంట చెరువులో ఓ యువకుడు పడి మృతి చెందాడు. మిల్స్‌కాలనీ ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం రంగశాయిపేట ప్రాంతానికి చెందిన మచ్చ రాజు(23) ఇంటర్ వరకు చదివాడు. ఏ పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. గురువారం ఉదయం తండ్రి మచ్చ కుమారస్వామి ఇంకా ఎన్ని రోజులు ఇలా ఖాళీగా ఉంటావని మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన రాజు గురువారమే ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోయే సరికి తన కుమారుడు కనిపించడం లేదని స్థానిక మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. శుక్రవారం ఉదయం మద్దెలకుంట చెరువులో ఓ యువకుడి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు వెళ్లి వివరాలు సేకరించగా రాజుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

తన తండ్రి మందలించి నందుకు జీవతంపై విరక్తి చెందిన రాజు ఆత్మహత్య చేసుకోవాలని చెరువులో పడి ఇత రాకపోవడంతో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.


మచ్చ రాజు (ఫైల్)

గుండెపోటుతో బాలిక మృతి

రాయపర్తి, ఏప్రిల్ 12 : గుండెపోటుతో బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని తిర్మలాయపెల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... తిర్మలాయపెల్లికు చెందిన చిక్కుడు రమాశ్యామ్ దంపతుల కుమార్తె అక్షిత(13) ఇటీవల అనారోగ్యానికి గురైంది. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న అక్షితకు గుండెపోటు రావడంతో మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.




వీధి కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

కుక్కల బెడద నివారణకు చర్యలు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 12: నర్సంపేట పట్టణంలో కుక్కల బెడదను అరికట్టేందుకు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. పట్టణంలోని 24 వార్డుల పరిధిలో తిరుగుతున్న కుక్కలను వాహనంలో తరలించి వాటికి సంతానోత్పత్తి కలగకుండా స్టెరిలైజేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ పెంపుడు కుక్కలపై తగు జాగ్రత్తలు తీసుకొని వీధుల్లో తిరగకుండా చూడాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి

రాయపర్తి, ఏప్రిల్ 12 : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుతో పాటు మండలంలోని పెర్కవేడులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రతి ధాన్యపు గింజను కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ధాన్యం కాంటాలు త్వరితగతిన కావాలని, గన్నీ సంచుల కొరత లేకుండా చూసుకోవడంతో పాటు రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా ఎండవేడిమిని తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డీఎస్‌వో శివప్రసాద్, డీఆర్డీవో పీడీ కౌసల్య దేవి, సివిల్ సప్లయి డీఎం సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ సురేందర్, ఏపీడీ భవాని, మార్కెట్ ఏపీడీ సుధాకర్, సీసీ దేవేంద్ర, వీవోఏలు రమాదేవి, మంగమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి, డీఎంఓ సంధ్యారాణి, డీసీఎస్‌వో శివప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేమశాతం 17 కంటే తక్కువ ఉంటే వెంటనే కాంటాలు పెట్టి ట్రాన్స్‌పోర్ట్‌చేసి ట్యాబ్‌లో వివరాలు నమోదుచేయాలన్నారు. తద్వారా రైతులకు సకాలంలో డబ్బులు వస్తాయన్నారు. కొనుగోలు కమిటీ సభ్యులు, రైతులు, హమాలీలతో మాట్లాడి తగిన సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఏనుగల్లు గ్రామంలోని విజయలక్ష్మి, మారుతి రైసు మిల్లులను సందర్శించి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని త్వరగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, డీపీఎం భవాని, ఏపీఎం కృష్ణమూర్తి, సీసీలు కాంతయ్య, సుధాకర్, వీవోఏలు రజిత, జ్యోతి, రమేష్, కరుణ పాల్గొన్నారు.

కబ్జా చేసిన భూమిని తిరిగిచ్చేయాలి


వర్ధన్నపేటలో కబ్జాకు గురైన భూమిలో టీడీపీ జెండాలు పాతుతున్న చాడ మరియా

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 12 : పట్టణంలోని గ్రోమోర్ సమీపంలో కబ్జా చేసిన భూమిని తిరిగి ఇచ్చేయాలని వర్ధన్నపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియా సురేఖ కోరారు. శుక్రవారం కబ్జాకు గురైన భూమిలో టీడీపీ జెండాలను నాటి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1994లో వర్ధన్నపేట నుంచి ఎర్రబెల్లి దయాకర్ రావు టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచాడని, ఆ తరుణంలో నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయం ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 0.06 గుంటల భూమిని కొనుగోలు చేశాడని గుర్తు చేశారు. ఆ భూమిలో పార్టీ కార్యాలయం నిర్మాణం చేయకుండా దయాకర్‌రావు తన ఆధీనంలో పెట్టుకున్నాడని ఆరోపించారు. టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో వెళ్లిపోయిన దయాకర్ రావు తిరిగి ఆ భూమిని టీడీపీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. పార్టీ కొనుగోలు చేసిన భూమిని అక్రమంగా ఎర్రబెల్లి రిజిస్ట్రేషన్ చేసుకుని ఇతరులకు అమ్మినట్లుగా తెలుస్తోందని, దీనిపై పోరాటం చేసి భూమిని కాపాడుతామని తెలిపారు. దయాకర్‌రావు భూ కబ్జాపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యాలయం కార్యదర్శి పిట్టల శ్రీనివాస్, కరుణాకర్, శృతి తదితరులు పాల్గొన్నారు.




నర్సంపేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎక్సైజ్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, అసిస్టెంట్ లేబర్ ఆఫీసు

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, జనం
పట్టించుకోని ప్రభుత్వం
ఒకే చోట నిర్మిస్తే అద్దెలు ఆదా!


అద్దె భవనంలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

నర్సంపేట, ఏప్రిల్ 12 : జిల్లాలోనే ఆరు మండలాలతో పెద్ద దిక్కుగా విరాజిల్లుతున్న నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే అనేక ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సరైన సౌకర్యాలకు నోచుకోకపోవడంతో ప్రతీ నిత్యం కార్యాలయాలకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇరుకు గదులతో కార్యాలయాల్లో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని వరంగల్ రోడ్‌లో అద్దె భవనంలో వాణిజ్య పన్నుల కార్యాలయం, ద్వారకపేట రోడ్‌కు కొద్ది దూరంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ద్వారకపేట రోడ్ పక్కన ఎక్సైజ్ శాఖ కార్యాలయం, పట్టణంలోని డఫోడిల్ పాఠశాల సమీపంలోని లేబర్ ఆఫీసు అద్దె భవనంలో కొనసాగుతోంది. నియోజకవర్గంలోని నిర్మాణ రంగం కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యాలయానికి వస్తుంటారు. ఇక్కడ సరైన సౌకర్యాలు లేక ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యా లయం కోసం కొన్నేళ్ల క్రితం మండల పరిషత్, ఇంజ నీరింగ్ కార్యాయలయం సమీపంలో స్థలం కేటాయించి భవన నిర్మాణం కోసం శిలాఫలకం వేసి భవన నిర్మాణాన్ని విస్మరించారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యా లయం అద్దె భవనంలోనే కొనసాగుతుండడంతో రిజిస్ట్రేషన్లకోసం వచ్చేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్సైజ్ కార్యాలయంలో సరైన గదుల సౌకర్యం లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో దాడులు చేసిన సమయంలో పట్టుకున్న మద్యం, బెల్లం, వాహనాలను పెట్టడానికి సరైన స్థలంలేక కార్యాలయం ఆవరణ, కార్యాలయంలో ఉంచుతున్నారు. అద్దె భవనాల్లో ఉండే ప్రభుత్వ కార్యాలయాలకు ఏటా కోట్లాది రూపాలయల అద్దెలు చెల్లిస్తున్నా కనీస సౌకర్యాలులేక అధికారులు. ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆదాయం వచ్చే ప్రభుత్వ కార్యాలయాలు...

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి ప్రభుత్వం సొంత భవనం నిర్మించకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. ఎక్సైజ్‌శాఖ కార్యాలయం కూడా అరకొర వసతుల అద్దె భవనంలో కొనసాగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవంలోనే కొనసాగుతోంది.

కార్యాలయాలన్నీ ఒకే చోట నిర్మించాలి

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట నిర్మించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అద్దె భవనాలు కాకుండా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో విశాలమైన స్థలం ఉందని, ఈ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట నిర్మించే వెసులు బాటుఉంది. ఈ స్థలంలో కార్యాలయాలన్నీ ఒకే చోట నిర్మించడానికి ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, నీటి పారుదలశాఖ కార్యాలయం, ట్రెజరరీ కార్యాలయాల సొంత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ కార్యాలయాల్లోని ఉద్యోగులు భయం మధ్య విధులు నిర్వహిస్తున్నారు.

రోడ్డు పనులను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే దొంతి : బీఆర్ఎస్


మంగళవారిపేటలో రోడ్డుపై పూలు చల్లి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ, ఏప్రిల్ 12 : అభివృద్ధి పనులు చేపట్టాల్సిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని ఆరోపిస్తూ మండలంలోని అలంకానిపేట గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్డుపై పూలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అలంకానిపేట గ్రామం నుంచి వయా పెద్దకొర్పోలు మీదగా చిన్నకొర్పోలు గ్రామం వరకూ బీటీ రోడ్డు, ఈ మార్గంలోని వట్టివాగుపై చెక్‌డ్యాంతో కూడిన బ్రిడ్జి నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషితో రూ.14కోట్లు మంజూరి చేయించారన్నారు. పనులకు సంబంధించి ఎంపీ ఎన్నికల కోడ్‌కు ముందే ప్రభుత్వం టెండర్లు పిలువగా ఎమ్మెల్యే మాధవరెడ్డి అధికారపార్టీ బలంతో కాంట్రాక్టర్లను బెదిరించడంతో, టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదన్నారు. తాము ఎన్నికల కోడ్‌ను గౌరవించి పూలతో శాంతియుతంగా రోడ్డుపై నిరసన కార్యక్రమాలను చేపట్టామన్నారు.కార్యక్రమంలో నెక్కొండ వైస్ ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ సోమయ్య, బీఆర్ఎస్ నాయకులు రవి, యాకయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

● ఖానాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన బీటీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధరావుపేట, కొడ్తిమాటతండా, మంగళవారిపేట గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్లపై పూలు(పుష్పాలు) చల్లి బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, ఎంపీటీసీ సుభాన్‌బీ, మాజీ సర్పంచ్‌లు కాస ప్రవీణ్‌కుమార్, సుమన్, బాలకిషన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి: నిధులు మంజూరైన బీటీ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని శుక్రవారం ముచ్చింపుల తండా, రంగాపురం, ముచ్చింపుల, దస్తగిరి పల్లి, అర్షణపల్లి, నాగరాజుపల్లి, మామిండ్లవీరయ్యపల్లి, పంతులుపల్లి, చిన్నతండాల ప్రజలు పూలతో శాంతియుత నిరసన కార్యక్రమం చేశారు.

● దుగ్గొండి: మంజూరైన బీటీ రోడ్ల పనులు చేపట్టాలని జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్ రావు డిమాండ్ చేశారు. దేశాయిపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని దేశాయిపల్లి నుంచి లక్ష్మీపురం, గుడిమహేశ్వరం గ్రామాలకు మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో బీటీ రోడ్లు మంజూరీ కాగా, పనులలో జాప్యం జరుగుతుందని, వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, ఎంపీటీసీలు రాజు, మామునూరి సుమన్, క్లస్టర్ ఇన్‌చార్జి గుండెకారి రంగారావు, ప్రశాంత్, మాజీ సర్పంచ్ పోశాలు, పురుషోత్తం, శోభన్, కృష్ణ పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి


ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటున్న సమ్మయ్య

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 12: ఉపాధిహామీ కూలీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రాజుపేట, ముత్తోజిపేటలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలను సంఘం ఆధ్వర్యంలో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కూలీలకు పనిలేకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని, లేనిఎడల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బస్క మొగిలి, ఎస్.కె. అన్వర్, రాజు, కోమల, స్వప్న, మంజుల పాల్గొన్నారు.

దగ్ధమైన మొక్కజొన్న పంట పరిశీలన

ఖానాపురం, ఏప్రిల్ 12: మండలంలోని కొత్తూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మొక్క జొన్న పంటలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావులు శుక్రవారం వేరువేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు ఎమ్మ కొమురయ్య జాటోతు భద్రు, బుడిమె కుమారస్వామిలను పరామర్శించారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముదురు రవి, అజ్మీర రాజు, సంపత్, రాములు, రవి పాల్గొన్నారు.

కొండ చిలువ హతం

చెన్నారావుపేట, ఏప్రిల్ 12 : మండలంలోని పుల్లయ్య బోడు తండాలో కొండ చిలువను గ్రామస్థులే హతం చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు కథనం ప్రకారం... ఇదేగ్రామనికి చెందిన ఓ రైతు పంట పొలానికి సాగు నీరు అందిస్తున్న క్రమంలో సుమారు ఆరు ఫీట్ల పొడుపున్న కొండ చిలువ వచ్చింది. దీంతో చుట్టు పక్కల రైతులు వచ్చి ప్రాణ రక్షణ కోసం పామును కొట్టి చంపారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పర్వతగిరి, ఏప్రిల్ 12: మండలంలోని వడ్లకొండలో రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయనిర్మాణానికి గ్రామానికి చెందిన కరిమిళ్ల సోమక్క-సంపత్‌రావు దంపతుల కుమారులు ప్రసాద్‌రావు-ధనలక్ష్మీ, రాజురావు-మానస దంపతులు రూ.1,00,116 ఆలయ కమిటీ బాధ్యులకు అందించారు.

రాజీవ్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

దుగ్గొండి, ఏప్రిల్ 12: కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేద కుటుంబానికి న్యాయం జరుగుతుందని, ఆ లక్ష్యంతో పనిచేస్తానని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పని చేస్తున్నదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పొరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, మండల వర్కింగ్ పార్టీ అధ్యక్షులు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, మాజీ సర్పంచ్ ఇంగోలి రాజేశ్వర్‌రావు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్, నర్సంపేట మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

15న ఎంఎస్పీ మానుకోట పార్లమెంటరీ సదస్సు

నర్సంపేట, ఏప్రిల్ 12 : ఈ నెల 15న నర్సంపేట పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో జరిగే మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్‌స్థాయి సదస్సును విజ యవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయదీప్ పిలుపు నిచ్చారు. సదస్సు జరిగే పట్టణంలోని వాసవి కల్యాణ మండపం పరిశీలించాక శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపాల్గొనే సదస్సును నర్సంపేట, ములుగు, మహబూబాబాద్, ఇల్లందు, భద్రాచలం,పినపాక, డోర్నకల్ నియోజక వర్గాల్లోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్పీ విధి విధానాలు, ఎస్సీ వర్గీకరణ అంశాలపై మంద కృష్ణ ప్రసంగిస్తారనిన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ కో కన్వీనర్ తగుగుల విజయ్ కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధూ, దామెర సుధాకర్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ విజయ సంకల్ప సభకు తరలిరండి


నర్సంపేటలో మాట్లాడుతున్న శీలం రాంబాబు

నర్సంపేట, ఏప్రిల్ 12 : మహబూబాబాద్‌లో ఈ నెల 13న జరిగే పోలింగ్ బూత్ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని నర్సం పేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు శీలం రాంబాబు పిలుపు నిచ్చారు. పట్టణంలోని సర్వాపురంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ని బూత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బూత్ కమిటీ సభ్యులు సంకల్ప సభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్మీర సీతారాం నాయక్‌ను గెలిపించడానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ ఇన్‌చార్జి గుడిపూడి రాధాకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, కూనమల్ల పృథ్వీరాజ్, ఠాకూర్ రవీందర్‌సింగ్, పొదిల రాంచందర్, మల్యాల సాంబమూర్తి, ఠాకూర్ శివాంజన్‌సింగ్, మల్లాజి నరేందర్, శ్రీనివాస్, కందికొండ శ్రీనివాస్, కందకట్ల నాగరాజు, బీజేపీ పట్టణ కార్యదర్శి ప్రభాకర్, ఠాకూర్ విజయ్ సింగ్, భవానిశంకర్, సప్తగిరి నరేశ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో బాలిక మృతి



రాయపర్తి, ఏప్రిల్ 12 : గుండెపోటుతో బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని తిర్మలాయపెల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తిర్మలాయపెల్లికు చెందిన చిక్కుడు రమాశ్యామ్ దంపతుల కుమార్తె అక్షిత(13) ఇటీవల అనారోగ్యానికి గురైంది. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న అక్షితకు గుండెపోటు రావడంతో మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.

కట్ట మైసమ్మ ఆలయాన్ని నిర్మించాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 12 : పట్టణంలోని కోనారెడ్డి చెరువు కట్టపై ఉన్న మైసమ్మ ఆలయాన్ని పునర్ నిర్మించాలని, ఆగిన పనులు వెంటనే ప్రారంభించాలని వర్ధన్నపేట ముదిరాజ్ సంఘం నాయకులు భూమ సుధాకర్, నారెల్లి సుధాకర్‌లు కోరారు. శుక్రవారం చెరువు కట్టపై నిలిచిన మైసమ్మ దేవాలయ పనులను పరిశీలించి మాట్లాడారు. అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ గుడి నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బొల్లు వెంకటయ్య శ్రీను, బోనాల వెంకన్న, ఎద్దు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పల్‌రావుపేటలో పట్టపగలు చోరీ

నెక్కొండ, ఏప్రిల్ 12 : నెక్కొండ మండలం అప్పల్‌రావుపేటలో ఉపాధి కూలీ తిప్పని వీరభద్రయ్య ఇంట్లో పట్టపగలు చోరీ జరిగినట్లు ఎస్సై మహేందర్ శుక్రవారం తెలిపారు. ఇంట్లోని బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.60.200 నగదు దొంగలు దోచుకెళ్లినట్లు చెప్పారు. వీరభద్రయ్య అతని భార్య ప్రమీల ఈ నెల 11 ఉదయం ఉపాధి పనులకు వెళ్లారని, సాయంత్రం ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో బీరువా తెరువగా బీరువాలోని బంగారు అభరణాలు, నగదు కనిపించలేదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని క్లూస్ టీంతో వివరాలను సేకరించామని ఎస్సై చెప్పారు. వీరభద్రయ్య ఇల్లు గ్రామానికి దూరంగా ఉండడంతో పట్టపగలు దొంగలు చోరీకి పాల్పడి ఉంటారన్నారు. సంఘన స్థలాన్ని నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, నెక్కొండ సీఐ చంద్రమోహన్ సందర్శించి దొంగతనం విషయమై విచారణ జరిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 12: నర్సంపేట పట్టణంలో ఈ నెల 13వ తేదిన ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగు తుందని పట్టణ ప్రజలు సహకరించాలని ట్రాన్స్‌కో డీఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● పర్వతగిరి: పర్వతగిరి సబ్ స్టేషన్‌లో నెల వారి మరమ్మతుల కారణంగా ఈ నెల 13న ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివే యనున్నట్లు ఏడీఈ చంద్రమౌళి తెలిపారు. అలాగే చౌటపెల్లి, ఏనుగల్లు సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవికుమార్ తెలిపారు.

● దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి, అడవిరంగాపురం విద్యుత్ సబ్ స్టేషన్లలో శనివారం సాంకేతిక సమస్య కారణంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ప్రతీష శుక్రవారం వెల్లడించారు.

'నిరసన చేపట్టడం సిగ్గుచేటు'

నెక్కొండ, ఏప్రిల్ 12: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభివృద్ధిపనులను అడ్డుకుంటున్నాడంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం సిగ్గుచేటని నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ బ్లాక్ ఉపాధ్యక్షుడు సముద్రాల కనుకయ్య ఆరోపించారు. శుక్రవారం నెక్కొండలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిధుల మంజూరీతో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఎలాంటి సంబంధంలేదని, ప్రతీ కాంట్రాక్టర్ దగ్గర ఐదు శాతం కమీషన్ తీసుకుని దొంగ జీవోలను ఇచ్చాడని వారు ఆరోపించారు. నిజానిజాలను తెలుసుకోకుండా అలంకానిపేట బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలను చేపట్టడం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవాచేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎడ్ల కిష్టయ్య, ఆకుల ఉప్పలయ్య, కోల నరేష్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 12 : ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయకుండా కల్లబొల్లి మాటలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలం వెల్లదీస్తున్నాయని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను కుల, మతాల పేరుతో విడదీస్తూ ప్రజల మధ్య మతకలహాలను సృష్టిస్తున్నాయని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. దోపిడీ పీడనలపై ప్రశ్నిస్తున్న ప్రజలను, ప్రజానాయకులపై అక్రమ కేసులు మోపి జైలుపాలు చేస్తున్నాయని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ బాధ్యుడు కుమార్, ఎంఎస్‌పి జిల్లాఅధ్యక్షుడు ప్రణయదీప్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసునాయక్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు జావిద్, డీటీఎఫ్ నాయకుడు రఘుపతి, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్, గౌడ జనహక్కుల పోరాట సమితి నాయకుడు రాజు,యాదవకుల పోరాటసమితి నాయకుడు రాజుయాదవ్, ఎంఎస్ఎఫ్ జిల్లాఅధ్యక్షుడు సిద్ధూ, ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకుడు ఇసాక్ పాల్గొన్నారు.

'కడియం కావ్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 12 : వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను ఓర్వలేక, బీజేపీ ఓటమి తప్పదని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన అరూరి రమేష్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాదిగ వర్గాలను డైవర్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్యబట్టారు.